సాక్షి అనంతపురం

శనివారం ၊ 9 ၊ ఆగస్టు ၊ 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.37

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.37, కనిష్టం రూ.27, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/22.1°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై మోస్తరుగా వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

‘ఉపాధి’ పనులపై ఆరా



ఉపాధి పనుల శిలాఫలకాలను పరిశీలిస్తున్న అధికారులు

యల్లనూరు(పుట్లూరు): పుట్లూరు మండలం అరకటివేముల పంచాయతీలో ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టిన పనులను శుక్రవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం మెంబర్ రీసెర్చ్ అధికారి డాక్టర్ సాంబశివరావు, అసిస్టెంట్ రీసెర్చ్ అధికారి నవ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి రిజిష్టర్లు, జాబ్‌కార్డు, వర్కు ఫైల్‌ను తనిఖీ చేశారు. సచివాలయంలో అన్ని శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తర్వాత కేంద్రం నిధులతో నిర్మాణాలు చేపట్టిన పక్కాగృహాలను సందర్శించారు. పలువురు పింఛన్‌దారులనూ కలిసి వివరాలు ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఐకేపీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏపీడీ పుల్లారెడ్డి, చెన్న కేశవులు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ నరసింహారెడ్డి, ఐకేపీ ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ఈసీ అంజన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పలు రైళ్లు రద్దు

ముదిగుబ్బ: సాంకేతిక సమస్యలతో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) మణికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–తిరుపతి,(57404), తిరుపతి–కదిరిదేవరపల్లి (57404), భాగల్ కోట్–మైసూర్(17308) రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడి మృతి



ఆంజనేయులు (ఫైల్)

రాయదుర్గంటౌన్: తేనెటీగల దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందిన విషాదకరమైన ఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన మేరకు... పట్టణంలోని 8వ వార్డు రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న ఆంజనేయులు(63)కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆంజనేయులు జీవాల పెంపకంతో జీవనం సాగించేవాడు. శుక్రవారం జీవాలను మేపేందుకని సమీపంలోని గౌడ ఇందిరమ్మ కాలనీ వద్దకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి మళ్లీ గొర్రెల వద్దకు వెళ్లాడు. మేపు అయిన తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో అక్కడే ఉన్న రావిచెట్టు ఆకులు తెంపుతుండగా అకస్మాత్తుగా తేనెటీగల గుంపు ఆంజనేయులును చుట్టుముట్టాయి. వాటి నుంచి తప్పించుకునే అవకాశం కూడా లేకపోయింది. అపస్మారకస్థితికి చేరుకుని చివరకు ప్రాణం కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు.



అమితమైన ప్రేమ అమ్మ. అంతులేని అనురాగం అమ్మ. అమ్మ ప్రాణం పోసి జీవమిస్తే.. ఆ ప్రాణానికి ఓ రూపు ఇచ్చి వ్యక్తిగతంగా వృద్ధిలోకి తెచ్చే వ్యక్తి నాన్న. ఈ ఇద్దరికీ దూరమై ఎంతోమంది చిన్నారులు అనాథలుగా మారిపోతున్నారు. అల్లారుముద్దుగా పెరగాల్సిన వారు దిక్కుమొక్కులేకుండా జీవిస్తున్నారు. అలాంటి వారు తమకూ అమ్మానాన్న కావాలని, అందరి పిల్లల్లా తామూ వారి ప్రేమకు నోచుకోవాలని ఎదురుచూస్తున్నారు.

అమ్మానాన్న కావాలి

- దత్తత కోసం అనాథ చిన్నారుల ఎదురుచూపులు
- చట్టప్రకారం జరిగితేనే దత్తత హక్కులు వర్తిస్తాయి
- బిడ్డను దత్తత ఇవ్వాలంటే తల్లిదండ్రుల సమ్మతి ఒక్కటే సరిపోదు
- ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా ఇచ్చినా దత్తత హక్కులు వర్తించవు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనాథ పిల్లలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివాహేతర సంబంధాల కారణంగా చాలామంది గర్భం దాల్చడం, ప్రసవం కాగానే ముళ్లపొదల్లోనో, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ పసికందులను వదిలి వెళుతున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. పేగు బంధాన్ని కాదనుకుని సమాజానికి భయపడి చేస్తున్న ఈ ఘటనలు కలచి వేస్తుంటాయి. కానీ ఇలాంటి పిల్లలను అక్కున చేర్చుకునేందుకు దత్తతకు ముందుకు రావాలనేది అందరి అభిప్రాయం.

దత్తత చట్టప్రకారమే జరగాలి..

దత్తత అనేది పుట్టగానే ఎవరి బిడ్డనో ఆ తల్లిదండ్రుల సమ్మతితో తెచ్చుకున్నంత మాత్రాన సరిపోదు. చట్ట ప్రకారమే జరగాలి. దత్తత కావాలనుకునే తల్లిదండ్రులు తమ పాన్‌కార్డు ద్వారా www.cara. nic. in (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం దంపతులు పాన్‌కార్డు, ఆదాయ, వయస్సు, నివాస, వివాహ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు దంపతుల ఫొటో వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ అప్‌లోడ్ చేసిన తర్వాత ఏజెన్సీకి రూ.6 వేలు డీడీ సమర్పించాలి. ఇవన్నీ పూర్తయ్యాక 48 గంటల లోగా దంపతుల మొబైల్‌కు సమాచారం వస్తుంది. అనంతరం ఏజెన్సీకి వెళ్లి బిడ్డను రిజర్వు చేసుకోవచ్చు.

బిడ్డ నచ్చిన తర్వాత..

బిడ్డ నచ్చిన తర్వాత రిజర్వు చేసుకొని, రూ.40 వేలు ఏజెన్సీకి చెల్లించాలి. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాత బిడ్డను అప్పగిస్తారు. బిడ్డను పొందిన వారం రోజుల్లోగా దత్తతకు వచ్చిన డాక్యుమెంట్లన్నీ స్థానిక ఫ్యామిలీ కోర్టు లేదా జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించి దత్తతకు అధికారిక ఉత్తర్వులు పొందే అవకాశం ఉంటుంది. శిశు గృహతో పాటు సీసీఐ (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్)లో ఉన్న వారినీ దత్తత చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో శిశుగృహలు, బాలల సంరక్షణ సంస్థ(సీసీఐ)ల్లో ఉంటున్న దాదాపు వంద మంది చిన్నారులు దత్తత కోసం ఎదురుచూస్తున్నారు.

రెండేళ్ల పాటు బిడ్డ పరిశీలన..

దత్తత తీసుకున్న దంపతులు బిడ్డను తీసుకెళ్లాక.. దత్తత ఏజెన్సీకి చెందిన ప్రతినిధి రెండేళ్ల పాటు బిడ్డను ప్రతి ఆరు మాసాలకోసారి పరిశీలిస్తారు. బిడ్డకేమైనా ఇబ్బందులున్నాయా, తల్లిదండ్రులు సరిగా చూసుకుంటున్నారా లేదా ఇవన్నీ పరిశీలించి జాతీయ దత్తత ఏజెన్సీ ‘కారా’కు సమర్పిస్తారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దత్తత ఇలా..	
ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు	
అబ్బాయిలు	48
అమ్మాయిలు	75
మొత్తం	123
విదేశీయులు దత్తత తీసుకున్నది	
అబ్బాయిలు	1
అమ్మాయిలు	8
మొత్తం	9
దత్తత కోసం వేచి ఉన్న దంపతులు	73
ఏటా దత్తత కోసం వచ్చే దరఖాస్తులు	25

శిశువుల పట్ల ఔదార్యం ఉండాలి



ఎంతోమంది అనాథ చిన్నారులు ఆసరా కోసం ఎదురుచూస్తున్నారు. చాలామంది సంతానం లేని జంటలు ఇలాంటి బిడ్డలను దత్తత తీసుకుని తల్లిదండ్రులు కావచ్చు. సంతానం లేకపోవడం శాపం కాదు.. దత్తత చేసుకోవడం ఒక వరం. శిశువుల పట్ల ఔదార్యం కలిగి ఉండాలి.

– తరిమెల రమణారెడ్డి, అమ్మ ట్రస్ట్ చైర్మన్

సూపర్ స్పెషాలిటీలో 11 నుంచి న్యూరో అత్యవసర సేవలు

అనంతపురం మెడికల్: జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి న్యూరో విభాగానికి సంబంధించి అత్యవసర (ఎమర్జెన్సీ) సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరికైనా తల, వెన్నెముకకు గాయమైతే నేరుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లవచ్చని పేర్కొన్నారు. న్యూరో విభాగానికి సంబంధించి ఆపరేషన్ థియేటర్, ఐసీయూతో పాటు అపార అనుభవం కలిగిన న్యూరో సర్జన్లు, నలుగురు పీజీ విద్యార్థులు అందుబాటులో ఉంటారని వివరించారు.

అలరిస్తున్న దేవరకోన జలపాతం



తాడిపత్రిటౌన్: బుగ్గ సమీపంలోని దేవరకోన జలపాతం జలసవ్వడులతో ప్రకృతి ప్రేమికులను అలరిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు జలపాతం భారీగా ప్రవహిస్తోంది. దేవరకోనలో కొలువైన లక్ష్మీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు జలపాతంలో సేదతీరుతూ పరవశించిపోతున్నారు.

అధిక వర్షాలతో టమాటకు చేటు



అమ్మకానికి టమాటాలను బాక్సుల్లో సిద్ధం చేసిన దృశ్యం

- నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: లాభాల దిశగా సాగుతున్న టమాట ధరలకు ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలు చేటు తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. టమాట నాణ్యత తగ్గితే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల హెక్టార్ల విస్తీర్ణంలో టమాట సాగులో ఉంది. జూలై మొదటి వారం నుంచి అనంతపురం మండలం కక్కలపల్లి మండీలో మార్కెటింగ్ మొదలైంది. కిలో రూ.25 ప్రకారం మొదలైన ధరలు ఈ నెల ఆరో తేదీ నాటికి గరిష్ట ధర రూ.47కు చేరుకుంది. ఒకట్రెండు రోజుల్లో రూ.50 మార్క్‌కు చేరుకుంటుందని భావించగా.. వర్షాల ఎఫెక్ట్‌తో శుక్రవారం కిలో రూ.37కు తగ్గిపోయింది. జూలై నెలంతా 15 కిలోల బాక్సు కనిష్టం రూ.300 నుంచి గరిష్టంగా రూ.700 వరకు పలకడంతో రైతులు కొంతవరకు లాభాల బాట పట్టారు. ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఇదే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. దీంతో రైతులు సంబరపడ్డారు. అయితే నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది. తెరపినివ్వకుండా వర్షాలు పడితే ఎగుమతులు తగ్గే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాయ తడిచి, మచ్చ వస్తే మార్కెట్‌లో ‘నో సేల్’ కింద ట్రేడర్లు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. అలాంటి సమస్యలు రాకుండా జిల్లా యంత్రాంగం, ఉద్యానశాఖ, మార్కెటింగ్‌శాఖ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటా వరలక్ష్మీ పూజలు, వ్రతాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వరమహాలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మంగళతోరణాలు కట్టి శ్రావణ లక్ష్మిని సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారి ఆలయాల్లోనూ సామూహిక వరలక్ష్మి వ్రతమాచరించారు. అమ్మవారి విగ్రహాన్ని పూలు, పండ్లు, ఆభరణాలు, నాణేలు, కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమతో వాయనాలు సమర్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురం సాయినగర్‌లో లక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గా మాత



అనంతపురం ఉమానగర్‌లో మహాలక్ష్మి అలంకారంలో రేణుకాయల్లమ్మ

పత్తి ధరలు పతనం

- క్వింటా రూ.8,400 నుంచి రూ.7,200కు డౌన్
- అన్నదాతల్లో మొదలైన ఆందోళన
- ఇప్పటికీ ఇళ్లల్లోనే పత్తి నిల్వలు



డి హీరేహాళ్ మండలం దొడగట్ట వద్ద సాగుచేసిన పత్తి (ఇన్‌సెట్) ఉద్దేహాళ్ వద్ద కోతకొచ్చిన పత్తి

రాయదుర్గం: జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గత ఏడాది రబీలో వ్యవసాయ బోర్లు, హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో 2,190 హెక్టార్లలో పత్తి సాగైంది. ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు తగ్గి.. పత్తి విస్తీర్ణం పెరిగింది. 13,695 హెక్టార్లలో పత్తి పంట పెట్టారు. రెండు నెలల క్రితం పంట కోతకొచ్చింది. అప్పట్లో పత్తి నాణ్యత ఆధారంగా క్వింటా ధర రూ.8000 నుంచి రూ.8,500 పలికింది. కొందరు రైతులు విక్రయించుకోగా, మరి కొందరు ఇంకో రెండు నెలల పాటు నిల్వ చేస్తే క్వింటా రూ.9 వేలకు పెరిగినపుడు అమ్ముకోవచ్చని ఆశించారు. అయితే పరిస్థితి తారుమారైంది. క్వింటా రూ.7200కు ధర పడిపోవడం రైతులను కలవర పెడుతోంది.

మార్కెట్ సదుపాయం కరువే..

జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నా సరైన మార్కెట్ సదుపాయం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి అమ్ముకోవాలంటే కర్ణాటక రాష్ట్రం బళ్లారి, తుమకూరు ప్రాంతాల్లోని మిల్లులు, ఏఎంసీ మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అక్కడ ఏ ధర నిర్ణయించినా సరే దానికే అమ్ముకోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని దళారులే ధర నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. ఊళ్లలోనే ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తి కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధరతో కొనాలి



ఈ ఏడాది పత్తికి ప్రారంభ ధర క్వింటాలు రూ.8500కు పైగా పలికినా.. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. దీంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పడిపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. పెట్టుబడులు చూస్తే ఎకరాకు రూ.40 వేల వరకు పెరిగిపోయాయి. కనీసం క్వింటా పత్తి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలికితేనే గిట్టుబాటు లభిస్తుంది. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి. నా వద్ద 20 క్వింటాళ్ల పత్తిని నిల్వ చేశాను. ధర కోసం వేచి ఉన్నా.

– జగదీశ్వర్‌రెడ్డి, రైతు, ఉద్దేహాళ్

రైతులను ఆదుకోవాలి




పత్తి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బళ్లారి మార్కెట్లో ఇష్టమొచ్చిన విధంగా ధరలు నిర్ణయిస్తున్నారు. కూటమి సర్కార్ మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలి. నష్టపోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.

– రామాంజినేయులు, రాయంపల్లి

కరెంట్ కనెక్షన్‌కు భారీ చార్జ్

☛ అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన విశ్వనాథ్ ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు విద్యుత్ కనెక్షన్ కోసం కార్యాలయానికి వెళ్లాడు. డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం 5 కిలో వాట్ల విద్యుత్ సామర్థ్యం అవసరం ఉంటుంది. ఇందు కోసం 5 కిలో వాట్లకు రూ.10,550 ఖర్చు అవుతుంది. అయితే జీఎస్టీలు, ఇతర చార్జీల కింద రూ.2,409 చెల్లిస్తేనే మీటర్ మంజూరు అవుతుందని విద్యుత్ అధికారులు తెలపడంతో షాక్‌కు గురయ్యాడు. రెండు రోజుల క్రితం నుంచే ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలపడంతో చేసేది లేక రూ.13వేలు చెల్లించి విద్యుత్ మీటర్ బుక్ చేసుకున్నాడు.

- ఇతర చార్జీల పేరిట రూ.2వేలకు పైగా వడ్డన
- కూటమి పాలనలో సామాన్యులపై మరో భారం
- మాట తప్పి ఇష్టారాజ్యంగా బాదుడేందంటున్న జనం



మీటర్ బుకింగ్‌లో ఇతర చార్జీల కింద రూ.2,041 వేసిన దృశ్యం

అనంతపురం టౌన్: అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని.. అవసరమైతే ఉన్న చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు ఇచ్చారు. గద్దెనెక్కిన తర్వాత మాట తప్పారు. వివిధ రూపాల్లో ఇష్టారాజ్యంగా చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. గతంలో రూ.50 అప్లికేషన్ ఫీజుతోనే మీటర్ బుక్ చేసుకునే అవకాశం ఉండేది. విద్యుత్ వినియోగాన్ని బట్టి కిలో వాట్‌కు ఇంత అని చెల్లించి మీటర్ తీసుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో కిలోవాట్ రుసుంతో పాటు స్టేట్ జీఎస్టీరూ.184, సెంట్రల్ జీఎస్టీ రూ.184, ఇతర చార్జీల కింద రూ.2041 చొప్పున విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతున్నారు.

కొత్త విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం చార్జీల వసూలు ఇలా..			
వాట్స్	రుసుము	అదనపు చార్జీలు	మొత్తం
2	రూ.4,100	రూ.2,400	రూ.6,500
3	రూ.6,200	రూ.2,400	రూ.8,600
4	రూ.8,400	రూ.2,400	రూ.10,800
5	రూ.10,550	రూ.2,400	రూ.12,950

‘కార్పొరేట్ల’కు దోచిపెట్టేందుకే..



విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు సిద్ధమయ్యాయి. అందులో భాగంగానే నష్టాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచేసి సామాన్యులపై భారం మోపుతున్నాయి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును గతంలో వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే తిరిగి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయిస్తున్నారు. దీనికి తోడు ‘ఇతర చార్జీల’ పేరిట రూ.2వేలకు పైబడి అదనంగా భారం మోపుతున్నారు. పెంచిన మొత్తాన్ని రద్దు చేయాల్సిందే. లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

– వి.రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర నాయకుడు

మాకే అవగాహన లేదు



కొత్తగా కరెంటు మీటర్ దరఖాస్తు సమయంలో సెక్యూరిటీ డిపాజిట్, వినియోగదారులు వాడే విద్యుత్ కిలోవాట్ సామర్థ్యాన్ని బట్టి డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవాళ్లం. ప్రస్తుతం మీటర్ బుకింగ్ సమయంలోనే వస్తున్న అదర్ చార్జెస్ (ఇతర చార్జీలు) వివరాలపై మాకే అవగాహన లేదు. కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌కు పంపి వాటి వివరాలు కనుక్కుంటాం.

– శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ఎలుగుబంటి సంచారం



రాయదుర్గం టౌన్: పట్టణ శివారులోని ముత్తరాసి కాలనీ కొండపై పట్టపగలే ఎలుగుబంటి సంచారించడంతో కాలనీ వాసులు బెంబేలెత్తి పోయారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎలుగుబంటిని చూసి కాలనీ వాసులు కేకలు వేయడంతో అది కాస్త పరుగుతీసింది. కాగా, తరుచూ ఈ ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించాలని కోరారు.



అనంతపురం నగరంలోని ఓ దుకాణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



అనంతపురంలో విక్రయాలకు ఉంచిన రాఖీలు



రాఖీలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు

నేడు 'రాఖీ'

అనుబంధానికి రూపం రక్ష. ఆత్మీయ బంధానికి ఆధారం రాఖీ. ఆ రెండింటి సమ్మిళితంగా తోబుట్టువుల తియ్యటి జ్ఞాపకం రక్షాబంధన్. తరాలు మారినా తరగని వన్నెతో తారతమ్యం లేకుండా జరుపుకునే పండుగ ఇదే. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతకు సాక్షిగా అజేయంగా వర్ధిల్లుతున్న ఈ సంబరం రానే వచ్చింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాఖీ పండుగను వేడుకగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. దీంతో నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ రాఖీ విక్రయాలు ఊపందుకున్నాయి. అలాగే శ్రావణ పౌర్ణమి నాడు హయగ్రీవ జయంతి, సత్యదేవుని వ్రతం, జంధ్యాల పౌర్ణమి, సంస్కృత దినోత్సవాన్ని కూడా వేడుకగా జరుపుకోనున్నారు. అనంతపురంలోని మూడో రోడ్డులో ఉన్న బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో నూతనంగా ఉపనయనం అయిన వటువులకు ఉపాకర్మ వేడుకలు నిర్వహించనున్నారు.

– అనంతపురం కల్చరల్:




నగరంలో రాఖీ కొనుగోలు చేస్తున్న ముస్లిం మహిళ

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

రాయదుర్గం టౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రహదారిలో ఉన్న సీతప్ప మిల్లు ఎదురు వీధిలోని రెండిళ్లలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. బాధితుల సమాచారం మేరకు.. కాలనీలో నివాసముంటున్న రామాంజనమ్మ తన ఇంటికి తాళం వేసి కర్ణాటకలోని గడేకల్లులో బంధువుల ఇంట జరిగే వివాహ వేడుక కోసమని వెళ్లారు. అలాగే అదే ఇంటిపై అంతస్తులో నివాసం ఉంటున్న గంగమ్మ కూడా ఇంటికి తాళం వేసి స్థానికంగానే ఉన్న పుట్టింటికి వెళ్లింది. ఇళ్లకు వేసిన తాళాలను గుర్తించిన దుండగులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాటిని పెకలించి లోపలకు ప్రవేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న గంగమ్మ.. తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలోని రూ.37 నగదు, 15 గ్రాముల బంగారు కమ్మలు, పట్టు చీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అనంతరం కిందకు దిగి చూడగా రామాంజినమ్మ ఇంట్లోనూ చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని గడేకల్లులో ఉన్న ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. రామాంజినమ్మ వస్తే ఆమె ఇంట్లో ఏ వస్తువులు చోరీ జరిగింది తెలుస్తుంది. చోరీ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

తపాలా శాఖ సూపరింటెండెంట్‌పై వేటు

- బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉన్నతాధికారుల నిర్ణయం



నూతన సూపరింటెండెంట్ లక్ష్మన్న నాయక్

అనంతపురం సిటీ: జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ కత్తి ఆదినారాయణను బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పాటు అక్రమార్కులను వెనకేసుకొస్తున్నట్లుగా ఆయనపై పలు ఆరోపణలున్నాయి. గతంలో తీవ్ర ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొన్న సూపరింటెండెంట్‌ను రెండు నెలల క్రితం తెలంగాణకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో గుంతకల్లులో పని చేస్తున్న కత్తి ఆదినారాయణకు అనంతపురం డివిజనల్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో అతి తక్కువ కాలంలోనే అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో విచారణ చేపట్టిన అధికారులు.. ప్రజల పొదుపు సొమ్మును స్వాహా చేసిన ఇద్దరు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లతో చేతులు కలిపి వారిపై ఎలాంటి చర్యలు లేకుండా కాపాడినట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌లో ఉన్న మరో ఇద్దరు పోస్టల్ అసిస్టెంట్లతోనూ లాలూచీపడి వారిని కాపాడినట్లుగా సమాచారం. తాడిపత్రిలోని బజారు పోస్టాఫీసులో గతంలో జరిగిన రూ.7 కోట్ల కుంభకోణం వ్యవహారంలో ఓ ముఖ్య ఉద్యోగికి రూ.70 లక్షలు మాఫీ చేసినట్లు తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులోనూ భారీగా డబ్బు చేతులు మారినట్లు తపాలా ఉద్యోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో శుక్రవారం కర్నూలులో నిర్వహించిన పోస్టల్ సూపరింటెండెంట్ల సమావేశంలో పీఎంజీ వెన్నం ఉపేందర్ సీరియస్ అయినట్లు తెలిసింది. కత్తి ఆదినారాయణను అదనపు బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆయనను గుంతకల్లులోని యథాస్థానానికి పంపారు. అలాగే చిత్తూరులో పని చేస్తున్న తపాలా శాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న నాయక్‌కు అనంతపురం డివిజన్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. దీంతో లక్ష్మన్న నాయక్ శుక్రవారం సాయంత్రం అనంతపురం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆ శాఖ ఉద్యోగులు పూలమాలలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బొలికొండ రంగనాథుడి కల్యాణోత్సవం నేడు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవం శనివారం నిర్వహించనున్నార. ఈ మేరకు ఆలయ ఈఓ శోభ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఏటా కల్యాణోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ శనివారం ఉదయం 11 నుంచి 12.05 గంటల్లోపు వేడుక నిర్వహణకు అర్చకులు ముహూర్తం నిర్ణయించారు.

కసాపురం ఆలయ ఈఓ బదిలీ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓ కె.వాణి బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా ఉరుకుందలోని నరసింహ ఈరన్న స్వామి ఆలయానికి, అక్కడి ఈఓ ఎం.విజయరాజును కసాపురం ఆలయానికి బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివాహిత మెడలోని బంగారు గొలుసు అపహరణ



బాధితురాలిని ఆరా తీస్తున్న పోలీసులు

యల్లనూరు(పుట్లూరు): పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన నబ్బూరి వెంకటనాయుడు భార్య నాగేశ్వరమ్మ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపిన మేరకు.. పుట్లూరు నుంచి కోమటికుంట్ల వైపు శుక్రవారం నాగేశ్వరమ్మ నడుచుకుంటూ వెళుతుండగా మార్గమధ్యంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారం గొలుసు లాక్కొని ఉడాయించారు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా.. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న సీఐ సత్యబాబు, ఇన్‌ఛార్జి ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి కోమటికుంట్లకు చేరుకుని బాధితురాలితో ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



హనుమేష్ (ఫైల్)

బొమ్మనహాళ్: ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్ గ్రామానికి చెందిన కురుబ హనుమేష్ (22) ఈ నెల 6న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారిలోని విమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ/క్రవారం ఉదయం మృతి చెందాడు. కాగా, ఈ నెల 5న మృతుడి అవ్వ మల్లమ్మ (65) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. చిన్నప్పటి నుంచి అల్లరు ముద్దుగా పెంచిన అవ్వ మృతిని హనుమేష్ జీర్ణించుకోలేకపోయాడు. ఆమె అంత్యక్రియలు జరిగిన మరుసటి రోజే పురుగుల మందు తాగినట్లుగా సమాచారం. మృతుడు తండ్రి వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

ఒంటరి జీవితాన్ని తాళలేక బలవన్మరణం

అనంతపురం సిటీ: ఒంటరి జీవితాన్ని తాళలేని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరుకు చెందిన ఆర్.శివప్రసాద్(21) తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క అక్కకు పెళ్లి జరిగి అత్తారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శివప్రసాద్ ఒంటరిగానే ఉంటున్నాడు. పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ఐస్‌క్రీములు సరఫరా చేస్తూ జీవనం సాగించేవాడు. తరచూ తల్లిదండ్రులు గుర్తుకు రావడం.. అక్క ప్రేమాభిమానులు దూరం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న శివప్రసాద్.. గురువారం రాత్రి అనంతపురం–తాటిచెర్ల రైల్వే మార్గంలో పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న అనంతపురం జీఆర్‌పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ దామోదర్... శుక్రవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. కాగా, తొలుత గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తులో మృతుడిని శివప్రసాద్‌గా గుర్తించారు. విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు తెలపడంతో వారు మార్చురీకి చేరుకుని నిర్ధారించారు.

రౌడీషీటర్ ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

తాడిపత్రి టౌన్: మండలంలోని ఊరుచింతల గ్రామానికి చెందిన రౌడీషీటర్ వెంకటరమణ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య దేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన వెంకటరమణ శుక్రవారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో విషపు పొడిని కలుపుకుని సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు.

తీరు మార్చుకోకపోవడంతోనే హత్య

- వ్యక్తి హత్యకేసులో వీడిన మిస్టరీ
- నిందితుడి అరెస్ట్



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామంలో ఈ నెల 6న రాత్రి చోటు చేసుకున్న దాసరి గోవిందు హత్య ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామానికి చెందిన దాసరి గోవిందు తన ఇంటి పక్కనే నివాసముంటున్న దాసరి ఓబయ్య, అతని కుమారుడు దాసరి రుషిదాసుతో తరచూ గొడవ పెట్టుకుని అనుచిత వ్యాఖ్యలు చేసేవాడు. ఇంట్లో ఆడవాళ్లను సైతం అసభ్య పదజాలంతో దూషించేవాడు. పలు మార్లు ఓబయ్య కుటుంబసభ్యులు నచ్చచెప్పినా అతనిలో మార్పు రాలేదు. దీంతో విసుగు చెందిన ఓబయ్య, రుషిదాసు ఎలాగైనా గోవింద్‌ను తుదముట్టించాలని భావించారు. ఈ నెల 6న రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వెళుతున్న గోవిందును గమనించిన ఓబయ్య వెంటనే వేటకొడవలితో నరికి హతమార్చి పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం గుంతకల్లులోని హనుమాన్ సర్కిల్ వద్ద ఉన పెట్రోల్ బంక్ వద్ద తచ్చాడుతున్న ఓబయ్యను ఎస్‌ఐ రాఘవేంద్రప్ప, సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న రుషిదాసు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్/శెట్టూరు: చిన్న పిల్లల గొడవలో కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని వ్యక్తి మృతికి కారణమైన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్ తెలిపారు. రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. శెట్టూరులోని ఎంపీపీ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈ నెల 4న పాఠశాలలో గొడవ పడ్డారు. ఈ విషయం అదే రోజు సాయంత్రం ఇంట్లో వారికి తెలిసింది. దీంతో ఓ విద్యార్థి తల్లిదండ్రులు ప్రకాష్, ప్రమీల నేరుగా మరో విద్యార్థి ఇంటి వద్దకెళ్లి నిలదీశారు. ఆ సమయంలో మాటమాట పెరగడంతో ప్రకాష్ దంపతులపై మారెక్క, లక్ష్మన్న, రాజు, వన్నూరక్క, తిప్పేస్వామి దాడి చేశారు. కట్టెతో కొట్టడంతో ప్రకాష్ (35)కు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం చిన్నంపల్లి గేట్ వద్ద నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పోలీసులపై దాడికి యత్నం

అనంతపురం: నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ కూడలిలో డ్రంకన్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులకు చేదు అనుభవం ఎదురైంది. నగరం నుంచి కురుగుంట వైపు శుక్రవారం ద్విచక్ర వాహనం వెళుతున్న రాజారెడ్డి అనే వ్యక్తిని ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుని బ్రీత్ అనలైజర్ తీయగానే ఒక్కసారిగా ఎదురు తిరిగాడు. తనకే డ్రంకన్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తారా? అంటూ ఊగిపోయాడు. ఒకానొక దశలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడికి యత్నించాడు. ఘటనపై నాల్గో పట్టణ పీఎస్‌లో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన టీడీపీ నేత నారాయణస్వామి జోక్యం చేసుకుని పోలీసులకు సర్దిచెప్పి రాజారెడ్డిని ఇంటికి పిలుచుకెళ్లాడు. కాగా, విధులకు ఆటంకం కలిగించడమే కాక దాడికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అతి సులువుగా ఇంటికి పంపించేయడం విమర్శలకు తావిచ్చింది. టీడీపీ నాయకుల సిఫారసుకు ఇచ్చిన విలువ.. సొంత శాఖలోని ఉద్యోగి ఫిర్యాదుకు ఇవ్వకపోవడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ శాఖలోని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

147 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్



సీజ్ చేసిన రేషన్ బియ్యం వాహనాన్ని చూపుతున్న అధికారులు

తాడిపత్రి టౌన్: మండలంలోని సజ్జలదిన్నె క్రాస్ వద్ద శుక్రవారం విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 147 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఈ మేరకు ఎస్‌ఐ వెంకటప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్ వెల్లడించారు. బియ్యం తరలిస్తున్న సోమన్నగారి నాగార్జున, ఐచర్ యజమాని చర్మాల రామచంద్ర, డ్రైవర్ చాపల నాగేంద్ర, క్లీనర్ పాపినేటి సురేష్‌పై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఓ వాసుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ లోపంతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రయాణికులను భయపెడుతోంది. అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరడంతో చీకటి పడితే బస్టాండ్ ఆవరణలో సంచరించేందుకు పురుషులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. నిర్వహణలో లోపాలను సరిదిద్దుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి నానాటికీ దిగజారుతోంది.



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద మద్యం తాగి వదిలేసిన ఖాళీ బాటిల్



బస్టాండ్‌లోని దుకాణంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఆర్టీసీ అధికారి కేఎస్ మూర్తికి ఫిర్యాదు చేస్తున్న మహిళ

భ్ర.. స్టాండ్!

- అనంతపురం ఆర్టీసీ బస్టాండులో పెచ్చుమీరిన అసాంఘిక కార్యకలాపాలు
- దుకాణాదారుల ఇష్టారాజ్యం
- హోటళ్ల నిర్వహణ దారుణం
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు
- కనిపించని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో అసాంఘిక శక్తులు రాజ్యమేలుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దొంగలు చేతి వాటాన్ని ప్రదర్శిస్తుంటే.. మరో వైపు తాగుబోతులు ఏకంగా బస్టాండ్ ఆవరణనే బార్‌గా మార్చేసుకున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాండులో అడుగు పెట్టాలంటేనే భయపడుతున్నారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజు ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడిగే వారు లేరు... అడ్డు తగిలే నాథుడూ లేడన్న ధీమాతో కొందరు అధికారులు ఎవరి స్థాయిలో వారు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండికొడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

కల్తీ ఆహారానికి కేరాఫ్..

బస్టాండ్‌లోని హోటళ్ల నిర్వహణ మరీ దారుణంగా మారింది. కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు, తినుబండారాలు, వాటి ధరలు చూడగానే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. అత్యవసర పరిస్థితి కావడంతో విధిలేక వాటినే కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే బస్టాండులో ఒంటరి మహిళలు, వృద్ధులు, అమాయకులను టార్గెట్‌గా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. విలువైన బంగారు, ల్యాప్‌టాప్ లాంటి పరికరాలతో ఉడాయించిన ఘటనలూ ఉన్నాయి. తమ వస్తువులు అపహరించారంటూ బాధితులు లబోదిబోమంటున్నా బస్టాండ్ ఔట్ పోస్టు పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో బస్టాండుకెళ్లి బస్సు ఎక్కడం కంటే నగరంలోని ఏదో ఒక కూడలిలో ఎక్కడం మేలనే ధోరణి ప్రయాణికుల్లో వ్యక్తమవుతోంది.

చీకటి పడితే అరాచకం..

చీకటి పడితే అనంతపురం ఆర్టీసీ బస్టాండులో తాగుబోతుల అరాచకం రాజ్యమేలుతోంది. బస్టాండు ఆవరణలోనే కాదు.. ఏకంగా టికెట్ బుకింగ్ కౌంటర్ వద్దనే మద్యం తాగి ఖాళీ బాటిళ్లను పడేసి వెళుతుంటారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గమనించిన మహిళలు భయంతో వణికి పోతున్నారు. రాత్రి సమయంలో ఔట్‌పోస్టు పోలీసులు సైతం ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయి.

నిర్వహణలో లోపాలు..

బస్టాండు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, అధికారుల నియామకాల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. స్టేషన్ మేనేజర్ల నుంచి పారిశుద్ధ్య కార్మికుల వరకూ ప్రతి విభాగంలోనూ ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేసే యోచన కూడా అధికారులు చేయడం లేదు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండులోకి సామాన్య ప్రయాణికుడు ధైర్యంగా అడుగు పెట్టే అవకాశాన్ని కల్పించాలని పలువురు కోరుతున్నారు. తాగుబోతులు, దొంగలకు బస్టాండు ఆవాసంగా మారిపోవడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాడింటన్ (అండర్-19) పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో శ్యాంనాథ్, ఎస్ఎండీ రిహాన్, కే.నివాస్, డి.ఇషాన్, బాలికల విభాగంలో రిధి, ఇంద్రాణి, గుణసాయి, ఇందు, బి.సాస్మిక, టి.హారిక ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి బి.ఉదయ భాస్కర్ తెలిపారు.

ఆర్వీపీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మనోజ్

అనంతపురం ఎడ్యుకేషన్: రాయలసీమ విద్యార్థి పోరాట సమితి (ఆర్వీపీఎస్) జిల్లా అధ్యక్షుడిగా కరణం మనోజ్ చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం నగరంలో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగింది. మనోజ్ కుమార్ చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు, రాయలసీమ సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రాయలసీమ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

అనంతపురం రూరల్: పేదలకు అండగా నిలవడమే ఎంఎస్ఎస్ సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్‌వలి అన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీలోని ప్రజలకు ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు నెల నెల పింఛన్ అందించడంతో పాటు, పెళ్లికానుక, మహిళా కార్మికులకు ప్రసూతి కానుక వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. రుద్రంపేట ఎంపీటీసీ-4 సభ్యురాలు మహబూబీ, ఎంఎస్ఎస్ సేవా సంస్థ సభ్యులు షెక్షావలి, ఖాజా, అక్కమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రాజస్థాన్ వాసి మృతి

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ లారీ మీద నుంచి కిందకు పడి చికిత్స పొందుతున్న రాజస్థాన్ వాసి భోజ్‌రాజ్ (48) శుక్రవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న భోజ్‌రాజ్ మూడు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలోని లిక్కర్ గోడౌన్‌కు కింగ్‌ఫిషర్ లోడ్ తీసుకుని వచ్చాడు. పైకి ఎక్కి లోడు ఓపెన్ చేసే క్రమంలో అదుపుతప్పి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

12న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం

రాప్తాడు: 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న మండల స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్ తెలిపారు. శనివారం సమావేశానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు జయన్న, చిరుతల నాగేంద్ర పాల్గొన్నారు.



హెచ్చెల్సీ కాలనీలో పూజలందుకున్న ముత్యాలమ్మ తల్లి



రాప్తాడులో విశిష్ట అలంకరణలో వరలక్ష్మీ దేవి



ఆత్మకూరు మండలం పంపనూరులో పార్వతీ దేవికి పూజలు



కరెన్సీ నోట్ల అలంకరణలో చెరువుకట్టపై వెలసిన నిముషాంబ దేవి



ఆత్మకూరులో వరలక్ష్మీ మాతను అలంకరించిన దృశ్యం

కటాక్షించు.. వరలక్ష్మీ దేవి

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- వాయనాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్న మహిళలు

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసం రెండవ శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మంగళతోరణాలు కట్టి శ్రావణ లక్ష్మీని సాదరంగా ఆహ్వానించారు. అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయం, పాతూరు, కొత్తూరు అమ్మవారి శాలల్లో పెద్ద ఎత్తున మహిళలు వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారు. వాసవీ మాత ఎదురుగా కూర్చుని వేదపురోహితుల వేదమంత్రాలకు అనుగుణంగా కుంకుమార్చన చేశారు. రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవార పూజలు నేత్రపర్వంగా నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చనల్లో మహిళలు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది. పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబ దేవి పసుపు అలంకారంలో దర్శనమిచ్చింది. ఉమానగర్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి, మొదటి రోడ్డులోని చౌడేశ్వరి దేవి, శివకోటిలోని లలితా శివ కామేశ్వరి ప్రత్యేక పూజలందుకున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

రాప్తాడు: మండలంలో గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్మయ నగర్‌లో తహసీల్దార్ విజయకుమారి వేద పండితుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం జరిపించారు. హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ అర్చకుడు ఈశ్వరయ్య స్వామి ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. 39 అడుగుల అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహస్ర నామార్చన, మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. ఆలయానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ దైవ కార్యక్రమానికి గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు. రాప్తాడులో నీలకంఠేశ్వర స్వామి, పండమేటి రాయుడు, చిన్మయనగర్‌లో వేంకటేశ్వర స్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి, బుక్కచెర్లలో నల్లలమ్మ, యర్రగుంట, పుల్లలరేవు గ్రామాల్లో చెన్నకేశవ స్వామి, మరూరులో చిన్నకదిరయ్య స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహాలను బంగారు ఆభరణాలతో అలంకరించారు. పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

కొలువుదీరిన అష్టలక్ష్ములు..

అనంతపురం మెడికల్: నగరంలోని విద్యుత్ నగర్‌కు సమీపంలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అష్టలక్ష్ములను కొలువుదీర్చారు. ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి వ్రతం ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



రాంనగర్‌లోని ఓ ఇంట్లో వరలక్ష్మీ వ్రతం ఆచరించిన దృశ్యం



విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో అష్టలక్ష్ముల అలంకరణ

వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి

అనంతపురం: అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ అధిక వడ్డీదారుల వేధింపులు తాళలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారు షాపులో పని చేస్తున్న మైనార్టీ యువకుడిపై అధిక వడ్డీ వ్యాపారస్తులు దాడులు చేసినా ఇప్పటి దాకా చట్టపరమైన చర్యలు లేవు. నగరంలో వడ్డీదారుల దందా పెరిగిపోతున్నా.. పోలీస్ శాఖ మాత్రం ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అక్రమ వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, బావిగడ్డ రమణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, ఏపీ మహిళా సమైకయ జిల్లా కార్యదర్శి పద్మావతమ్మ, అధ్యక్షులు పార్వతి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి వి. కృష్ణుడు, అల్లీపీరా, ఎల్లుట్ల నారాయణ స్వామి, బంగారు బాష, రాజు ప్రసాద్, యశోదమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

హోంగార్డు మృతికి సంతాపం

తాడిపత్రిటౌన్: హోంగార్డు మృతికి పోలీసులు శుక్రవారం సంతాపం తెలిపారు. వివరాలు.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నాగరాజు గురువారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జగదీష్ అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాంధీనగర్‌లోని ఇంట్లో ఉంచిన మృతదేహానికి ఆర్ఎస్ఐ జాఫర్, ఏఆర్ ఎస్ఐ నాగేశ్వరావు, పీఎల్సీ నారాయణస్వామి, టౌన్ సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా , సిబ్బంది నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

రోగులను వదిలేద్దాం.. మందులు తీసుకెళ్దాం

- సర్వజనాస్పత్రిలో వీల్‌చైర్లపై మందుల తరలింపు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు వినియోగించాల్సిన వీల్‌చైర్, స్ట్రెచర్లను మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ), ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్ఓ) మందులు తరలించేందుకు తీసుకెళ్తున్నారు. వాస్తవంగా మందులు తరలించేందుకు ప్రత్యేక వాహనాలంటూ లేవు. దీంతో అందుబాటులో ఉన్న వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్లపై మందులను తీసుకెళ్తున్నారు. వాస్తవంగా సర్వజనాస్పత్రి అధికారులు వీటిపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. వీల్‌చైర్, స్ట్రెచర్లను తీసుకెళ్లినా.. కాసేపటికి మందులు తీసుకుని వార్డులకు వచ్చేయాలి. కానీ అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. వారు తిరిగి వచ్చే వరకు వీల్‌చైర్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పదుల సంఖ్యలో వీల్‌చైర్లు ఉన్నా.. వాటిని సరిగా వినియోగించడం లేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం , అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి రోగులకందే సేవల్లో నాణ్యత పెంచేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. ప్రతి వార్డులోనూ స్ట్రెచ్చర్, వీల్‌చైర్ ఏర్పాటు చేసి.. సకాలంలో ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ చేయిస్తే బాగుంటుందని రోగులు కోరుతున్నారు.



దేశ సేవలో భాగస్వాములు కండి

అనంతపురం అర్బన్: ప్రతి పౌరుడు దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆర్‌డీఓ కేశవనాయుడు పిలుపునిచ్చారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో హర్ ఘర తిరంగా ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ నుంచి నగర పాలకసంస్థ కార్యాలయం సమీపంలోని త్రివర్ణ పతాక స్తంభం వరకు ర్యాలీ సాగింది. అనంతరం నోడల్ అధికారి పర్యాటక శాఖాధికారి జయకుమార్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆర్‌డీఓతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబు, తహసీల్దార్ హరికుమార్ మాట్లాడారు. దేశం మనకేమి ఇచ్చిందని కాకుండా పౌరులుగా ఈ దేశానికి మనమేమిస్తున్నామనేది ముఖ్యమన్నారు. ఈ దేశం నాది.. ఈ నేల నాది అనే నినాదం ప్రతినోట ఘర్జనలా రావాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ప్రతిపౌరుడిలో దేశభక్తిని పెంపొందిస్తాయన్నారు. ఆగస్టు 15 వరకు నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, యువత, పౌరులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీ రమణ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

అనంతపురం అర్బన్: కమ్యూనిస్టు యోధుడు ఎంవీ రమణ పోరాట స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. శుక్రవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన ఎంవీ రమణ వర్ధంతి సభ నిర్వహించారు. ఎంవీ రమణ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఎంవీ రమణ ప్రజాసమస్యల పరిష్కానికి పోరాటాలు సాగించారన్నారు. అనాటి కాలంలో విశాఖ ఉక్కును ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పాలని జరిగిన పోరాటంలో విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నడిపిన ఉద్యమానికి కన్వీనర్‌గా వ్యవహరించారన్నారు. పేద ప్రజల సమస్యలు ఎక్కడుంటే అక్కడ కమ్యూనిస్టు పార్టీ జెండా ఉండాలని ఆకాంక్షించారన్నారు. విద్యార్థులు, యువతను ఉద్యమాలవైపు ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, ఎంవీ రమణ కుమారుడు, న్యాయవాది వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు రమణ, లింగమయ్య, రాజేష్ గౌడ్, పద్మావతి, కృష్ణుడు, సంతోష్ కుమార్, నాయకులు జాన్సన్ బాబు, కుళ్లాయి స్వామి, అల్లీపీరా, యశోదమ్మ, శ్రీనివాసులు, చాంద్‌బాషా, రాజు, నాగప్ప, మంజునాథ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎంవీ రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కలెక్టర్ గారూ.. మీరైనా స్పందించరూ

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా రోడ్లను బాగుచేసేవారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. అనంతపురం నుంచి బీకేఎస్‌కు కలెక్టరేట్ మీదుగా వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ఇదే రహదారిపై రోజూ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు వస్తూ పోతున్నారే తప్పా,, ఇంతవరకూ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చిన్నపాటి వర్షాలకే గుంతలు నిండి వాహనదారులకు నరకయాతనగా మారుతోంది. కనీసం గుంతలు కూడా పూడ్చలేక పోవడం దారుణమని వాహనదారులు వాపోతున్నారు. ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలకు సరిహద్దుగా ఉన్న రోడ్డు బాగోగుల నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి చెరువు కట్ట రోడ్డు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



గుంతలమయమైన చెరువు కట్ట రోడ్డు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్ ఏడీ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక నగర్, యార్కెట్ ఏరియా, అంబేడ్కర్ నగర్, సంఘమేష్ సర్కిల్, కమలా గనర్, రాజు రోడ్డు, రహమత్ నగర్, కోర్టు రోడ్డు, క్లాక్ టవర్, అశోక్ నగర్, జీసస్ నగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, బుడ్డప్ప నగర్, నవోదయ కాలనీ, రెవెన్యూ కాలనీ, చిన్మయ నగర్, ప్రసన్నాయపల్లి, జేఎన్‌టీయూ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంత ప్రజలు గమనించాలని కోరారు.

రాప్తాడు మండలంలో..

రాప్తాడు: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుతు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం పట్టణంలోని రామనగర్‌లో ఉన్న 132-11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో అత్యవసరంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీలపై దాడులు హేయం

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరిగిపోయాయి. చట్ట సభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్‌ఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ నాయకులు బీసీలపై దాడులు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. చంద్రబాబు దాడులు ఆపి.. బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని రావాలన్నారు.

రేపు రామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలో వెలసిన శ్రీరామకృష్ణ సేవా సమితి 21వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 10న ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శ్రీధరమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పావగడ శ్రీరామకృష్ణ సేవాశ్రమం నుంచి స్వామి జపానంద మహారాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. ఆదివారం ఉదయం రామకృష్ణ కథామృత పఠనం, సాయంత్రం నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి



కనగానపల్లిలో వృథాగా ఉన్న ఇరిగేషన్ కార్యాలయ భవనం

మండల కేంద్రం కనగానపల్లిలో నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) ఏఈ కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన సుమారు రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనాన్ని ఆ శాఖ అధికారులు ఇప్పటి వరకు వినియోగించుకోలేదు. దీంతో ఆ భవనం వినియోగంలోకి రాకనే శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది.

– కనగానపల్లి:

శునక ప్రేమ



శునకం విశ్వాసానికి మారుపేరు. ఒకసారి యజమానిని నమ్మితే చివరి శ్వాస వరకూ వదిలి వెళ్లవు. నగరంలో శుక్రవారం ఓ మహిళ తోపుడు బండిపై రాఖీలు పెట్టుకుని విక్రయించేందుకు బయలుదేరింది. ఇంట్లో పెంచుకున్న శునకం యజమానిని విడిచి ఉండలేక తోపుడు బండిని వెంబడించింది. గమనించిన మహిళ శునకాన్ని తోపుడు బండిపై కూర్చోపెట్టుకుని ముందుకు సాగింది. గమనించిన పలువురు శునకంపై యజమానికి ఉన్న ప్రేమను కొనియాడారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

అల్లుకుపోయిన నిర్లక్ష్యం

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఈ విద్యుత్ స్తంభం నిలువుదట్టంగా నిలుస్తోంది. కోవూరు నగర్‌లోని ఫ్రీస్కూల్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయాయి. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలను చుట్టేశాయి. వర్షాకాలంలో తీగలపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించకపోతే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం మెండుగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

– అనంతపురం టౌన్:



విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన పిచ్చిమొక్కల తీగలు